క్లుప్తంగా

ఐఎస్‌టీడీ స్వభ్యత్వంతో బహుళ ప్రయోజనాలు



మాట్లాడుతున్న ఐఎస్‌టీడీ చైర్మన్ రావు

మురళీనగర్: ఇండియన్ సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్(ఐఎస్‌టీడీ)లో సభ్యత్వం తీసుకోవడం వల్ల బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని విశాఖ ఐఎస్‌టీడీ చైర్మన్ డాక్టర్ ఓఆర్ఎం రావు అన్నారు. కంచరపాలెం ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్(గైస్)లో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.రమణ అధ్యక్షతన ఐఎస్‌టీడీ 54వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అనుభవజ్ఞులైన సాంకేతిక నిపుణులతో మాట్లాడి తమ సందేహాలు నివృత్తి చేసుకోవడమే కాకుండా నూతన సాంకేతిక విధానాలపై అవగాహన పొందవచ్చన్నారు. ప్రిన్సిపాల్ రమణ మాట్లాడుతూ గతేడాది జూన్‌లో నిర్వహించిన పర్యావరణ దినోత్సవ కార్యక్రమానికి జాతీయ స్థాయిలో ద్వితీయ బహుమతి గైస్‌కు లభించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కెమికల్ హెడ్ డాక్టర్ బీవీ లక్ష్మణరావు, సేఫ్టీ కోర్స్ కో ఆర్డినేటర్ ఎ.వరహాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కారాల ప్రదానం

సీతంపేట: దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ, విశాఖ రత్న కళాపరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో క్రోధి నామ సంవత్సర జాతీయ రత్న ఉగాది పురస్కారాల ప్రదానం జరిగింది. ముఖ్య అతిథి సెంచూరియన్ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు పురస్కారాలు ప్రదానం చేశారు. సంఘ సేవకుడు కాకినాడ రాయపల్లి శ్రీనివాస్, తప్పెటగుళ్ల కళాకారుడు నేలబోను సత్యం, కోనసీమ కూచిపూడి కళాకారిణి సత్యవాణి రావి, రచయిత కిల్లాన శ్రీనివాసరావు, న్యాయవాది ఆకుల గణేష్, గాయని మామిడి మాధురి, రంగస్థల నటుడు ఇమంది ఈశ్వరరావు, ప్రజా సంఘాల ఐక్యవేదిక ప్రతినిధి బి.చిన్ని యాదవ్, శోభన్‌బాబు నట ప్రావీణ్యుడు ఇ.గంగరాజు, నర్తకుడు కోపల్లె వెంకట శ్రీనివాసరావు పురస్కారాలు అందుకున్నారు.

చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థుల సత్తా



జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులతో స్కూల్ ప్రిన్సిపాల్, సిబ్బంది

తాటిచెట్లపాలెం: జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో రైల్వే న్యూకాలనీ హరగోపాల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. 10 మంది బంగారు పతకాలు, ఐదుగురు వెండి పతకాలు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ టి.శంకరరావు నాయుడు తెలిపారు. ఇటీవల కేఎస్ యూనివర్సిటీలో డ్రీమ్ యంగ్ అండ్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగిన జాతీయ స్థాయి బాలల చిత్రలేఖనం పోటీల్లో తమ స్కూల్ విద్యార్థులు 60 మంది పాల్గొనగా.. వీరిలో 15 మంది బంగారు, వెండి పతకాలతోపాటు ప్రశంసాపత్రాలను అందుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. తల్లిదండ్రులు తమ పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను గుర్తించి ప్రోత్సహించాలని శంకరరావు నాయుడు సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ టి.కనకమహాలక్ష్మి, డ్రాయింగ్ టీచర్ డి.సుమన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాంగం ఆవిష్కరణ

మురళీనగర్: విశాఖ శిష్టకరణ సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మురళీనగర్‌లో నూతన సంవత్సర పంచాంగాన్ని ఆవిష్కరించారు. వేదాంత జ్యోతిష్యులు అడబాల సత్యనారాయణ పంచాంగ శ్రవణం చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకుడు పి.ఎస్.మూర్తి పట్నాయక్, సన్ మూర్తి, సదాశివుని లక్ష్మణరావు, కార్యవర్గ సభ్యులు పి.ఎస్.మూర్తి పటాన్నయక్, బలివాడ హరిబాబు, బలివాడ అప్పలనరసయ్య, వీటీబీ పట్నాయక్, కుప్పిలి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనను ఆదరించండి



43వ వార్డులో కరపత్రం అందించి ఓటు అభ్యర్థిస్తున్న కె.కె.రాజు, ఉషశ్రీ



వెంకటేశ్వర కాలనీలో కె.కె.రాజుకు హారతిచ్చి, విజయ తిలకం దిద్దుతున్న మహిళలు

- వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు
- 43వ వార్డులో ఇంటింటా ప్రచారం

సీతంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనను ఆదరించి రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు కోరారు. జీవీఎంసీ 43వ వార్డు వెంకటేశ్వర కాలనీలో కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీతో కలిసి శుక్రవారం ఆయన మార్నింగ్ వాక్ నిర్వహించారు. అడుగడుగునా మహిళలు హారతులతో ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి నివాసులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గడిచిన ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను కె.కె.రాజు వివరించారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఇంటింటా కరపత్రాలు పంచారు.



46వ వార్డు మధుసూదన్‌నగర్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న కటుమూరి సతీష్

కార్యక్రమంలో పార్టీ నాయకులు దుప్పలపూడి శ్రీనివాసరావు, గంగామహేష్, బైరా వెంకట్, జె.సత్తిబాబు, ఠాగూర్, మహాదాస్య గోపి, నేతల కుమార్, పద్మశేఖర్, ఎస్.నరసింగరావు, జగదీష్, సఖి, తిరుపతిరావు, నరసయ్య, భీమా, బాధ శ్రీను, సూర్యారావు, ప్రసాద్, సింహాచలం, బంగారమ్మ, రమ, ఎం. రాణి, సీనియర్ నాయకులు బి.గోవింద్, ఎం.సునీల్, అంబటి శైలేష్, బద్రీ, జ్ఞానేష్, పార్టీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపుతోనే అభివృద్ధి బాట

కంచరపాలెం: విశాఖను, ఉత్తర నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపించాలంటే వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజులను గెలిపించుకోవాలని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ పిలుపునిచ్చారు. 46వ వార్డు మధుసూదన్‌నగర్, కస్తూరినగర్ కొండవాలు ప్రాంతాల్లో శుక్రవారం ఆయన సార్వత్రిక ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలపరిచిన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఇంటింటికీ వెళ్లి ప్రచార కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో సేనాపతి అప్పారావు, బి.గోవింద్, కె.చిన్నా, జి.అప్పారావు, ఎస్.కృష్ణ, కె.ఈశ్వరరావు, కె.లావణ్య, కె.రామారావు, ఎస్.వి.రమణ, కె.శ్రీను, ఎన్.ఈశ్వరరావు, సీతయ్యరెడ్డి, దుర్గాభవాని, బాల, బోట్టా రాజు, నారాయణరెడ్డి, అప్పలరెడ్డి, అన్నపూర్ణ, జగదీష్, దేవి, ఎస్.వరలక్ష్మి, జి.వరలక్ష్మి, విజయలక్ష్మి, కళావతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రను నాశనం చేసింది చంద్రబాబే



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు. చిత్రంలో గొల్ల బాబూరావు, నాయకులు

- జగనన్న పాలనలో ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం
- వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

మద్రిపాలెం: ఉత్తరాంధ్రను నాశనం చేసిన పాపం టీడీపీ అధినేత చంద్రబాబుదేనని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. 53వ వార్డు పంజాబ్ హోటల్ జంక్షన్ వద్ద కార్పొరేటర్ బర్కత్ అలీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ వార్డు ఎన్నికల కార్యాలయాన్ని శుక్రవారం రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కె.కె.రాజు మాట్లాడుతూ చంద్రబాబు ఎంతసేపూ తన సామాజిక వర్గానికే లబ్ధి చేకూర్చడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా నేరుగా ప్రజల్లోకి వెళ్లి, వారి సమస్యలను తెలుసుకుని తక్షణ పరిష్కారం చూపించామని, ప్రజా సమస్యలపై పూర్తి అవగాహన తమకు ఉందని చెప్పారు. అన్నిటికీ మించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఇంట్లో పిల్లలు చదువుకునేలా ప్రోత్సహించి, వారికి అన్ని విధాలుగా తోడ్పడటం మామూలు విషయం కాదన్నారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి నాయకులు గడిచిన ఐదేళ్లలో ప్రజల సమస్యలను ఒక్కరోజైనా తెలుసుకోవడానికి ప్రయత్నించారా అని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో ఓటు హక్కుతో కూటమిని ఓడించాలని పిలుపునిచ్చారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి: రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు

ఉత్తరాంధ్ర ప్రజలకు చంద్రబాబు ఏం చేశారని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు ప్రశ్నించారు. గత ఎన్నికల్లో విజయం సాధించిన టీడీపీ ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కనీసం ఒక్కసారైనా ప్రజల్లోకి వచ్చి పట్టించుకున్న పాపానపోలేదన్నారు. స్వల్ప ఓట్లతో ఓడినప్పటికీ కె.కె.రాజు ధైర్యంగా ఉంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఈ ఐదేళ్లు ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వారితో మమేకమయ్యారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి విశాఖ ఆడపడుచు



53వ వార్డు ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, కె.కె.రాజు

బొత్స ఝాన్సీని, ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజులను అత్యధిక మెజారిటీతో గెలిపించి ముఖ్యమంత్రికి బహుమతిగా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ముందుగా సర్వమత బోధకుల ప్రార్థనలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.

వైఎస్సార్‌సీపీలో ముస్లింల చేరిక

ఈ సందర్భంగా మద్రిపాలెం మసీద్ కమిటీ మాజీ మెంబర్ మొహమ్మద్ నజీర్, జాకీర్‌హుస్సేన్ నగర్ మసీద్ అధ్యక్షుడు షేక్ మున్నాతోపాటు మరికొందరు ముస్లింలు కె.కె.రాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ వార్డు ఇన్‌చార్జి గుజ్జు వెంకటరెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో వీకే పీసీపీఐఆర్ చైర్మన్, ఉత్తర ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్, ఉత్తర ఎన్నికల పరిశీలకుడు బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు రెయ్యి వెంకటరమణ, సారిపిల్లి గోవింద్, కె.వి.ఎన్.శశికళ, జేసీఎస్ మండల అధ్యక్షుడు కృష్ణారావు మాస్టర్, జేసీఎస్ కన్వీనర్ అమరరెడ్డి, వార్డు సీనియర్ నాయకులు షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలోకి ముస్లిం నాయకులను ఆహ్వానిస్తున్న కె.కె.రాజు

ఎన్నికల్లో యువత పాత్ర కీలకం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు



సమావేశానికి హాజరైన యువత

సీతంపేట: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో యువత పాత్ర కీలకమని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. 26వ వార్డు చాకలిపేటలోని ఎన్నికల కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం యువతతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో పెనుమార్పులు తీసుకొచ్చారని తెలిపారు. విద్యతోనే సామాన్యుడికి సైతం గుర్తింపు లభిస్తుందని భావించిన ఆయన ప్రతి ఇంట్లో ఉన్నత విద్యావంతులు ఉండాలని ఆలోచించారన్నారు. వాస్తవ పరిస్థితిని యువత తెలుసుకుని ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని కె.కె.రాజు కోరారు. కార్యక్రమంలో వీకే పీసీపీఐఆర్ చైర్మన్, ఉత్తర ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, ఎన్నికల పరిశీలకుడు బాణాల శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ బులుసు జగదీష్, ఎం.సునీల్, రేవతీరావు, బొడ్డేటి కిరణ్, అళ్ల శివగణేష్, 26వ వార్డు సీనియర్ నాయకులు అనురాగ్, పాండవ శ్రీను, రవిబాబు, ఈశ్వర్, ప్రకాష్, శేషు, విజయ్‌పాల్, హరి, బాబి జాన్, శ్యామల, అమ్మాజీ, సుశీల, కాళ్ల ప్రకాష్, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా డివిజనల్ స్పోర్ట్స్ ఫెస్టివల్

విశాఖ స్పోర్ట్స్: ఈకోర్స్ వాల్తేర్ ఆధ్వర్యంలో జరుగుతున్న డివిజనల్ స్పోర్ట్స్ ఫెస్టివల్ ఉత్సాహంగా సాగుతోంది. ఈకోర్స్ పరిధిలోని పలు డిపార్ట్‌మెంట్లకు చెందిన మెన్ 13 క్రీడాంశాల్లోనూ, వుమెన్ జట్లు 8 క్రీడాంశాల్లోనూ పోటీపడుతున్నాయి. వెయిట్‌లిఫ్టింగ్ 49 కేజీల వెయిట్ కేటగిరీలో ఎస్.లక్ష్మి, 49 కేజీల వెయిట్‌లో పి.నాగమణి, 55 కేజీల వెయిట్‌లో ఎ.పుణ్యవతి, 59 కేజీల వెయిట్‌లో కె.సీలవేణి, 64 కేజీల వెయిట్‌లో కె.శారద విజేతలుగా నిలిచారు. క్రికెట్ పోటీల్లో భాగంగా తొలి క్వార్టర్ ఫైనల్‌లో నిర్ణీత 20 ఓవర్లలో కనస్ట్రక్షన్ జట్టు ఏడు వికెట్లకు 110 పరుగులు చేయగా ఆఫీసర్స్ జట్టు రెండు వికెట్లు కోల్పోయి విజయలక్ష్యాన్నందుకుంది. మరో క్వార్టర్ ఫైనల్‌లో ఎలక్ట్రికల్ టీఆర్‌డీ విభాగం ఏడు వికెట్లకు 231 పరుగులు చేయగా.. ఎలక్ట్రికల్ జనరల్ విభాగం 59 పరుగులకే ఆలౌటైంది. మూడో క్వార్టర్ ఫైనల్‌లో కమర్షియల్ విభాగం మూడు వికెట్లకు 159 పరుగులు చేయగా.. మెడికల్ జట్టు 38 పరుగులకే ఆలౌటైంది. ఫుట్‌బాల్ తొలి సెమీస్‌లో ఆపరేటింగ్ విభాగం పెనాల్టీ షూటౌట్‌లో 4-0తో కమర్షియల్ విభాగంపైన, క్యారేజ్ వేగన్ విభాగం 1-0తో ఆర్పీఎఫ్‌పైన విజయం సాధించి ఫైనల్‌కు చేరుకున్నాయి. సెమీస్ విజేతలు పోటీల ముగింపు రోజైన మే 9న ఫైనల్స్‌లో తలపడనున్నాయి.

రామ మందిర దర్శనం పూర్వజన్మ సుకృతం

మురళీనగర్: అయోధ్యలోని రామ మందిర దర్శనం తమ పూర్వజన్మ సుకృతమని ఆర్ష విజ్ఞాన పరిషత్ మహిళా సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. పరిషత్ ఆధ్వర్యంలో 60 మంది మహిళలు ఇటీవల అయోధ్య రామ మందిరాన్ని దర్శించుకుని 9 రోజులు సంపూర్ణ రామాయణ పారాయణం దిగ్విజయంగా పూర్తి చేశారు. అనంతరం వీరు శుక్రవారం మురళీనగర్ చేరుకున్నారు. మరీదు వరదరాజుల గురువు శిష్యరికంలో సంపూర్ణ రామాయణ పారాయణం, భాగవతం, భగవద్గీత పారాయణం అభ్యసించారు. ఆర్ష విజ్ఞాన పరిషత్ చైర్మన్ కంటిపూడి వెంకటేశ్వరరావు, గోగినేని ఉమాదేవి, కోశాధికారి పీఎస్ఎన్ మూర్తి ప్రోత్సాహంతో అయోధ్య రామ మందిరంలో సంపూర్ణ రామాయణ పారాయణం చేశారు. మహిళా రామభక్తులు మురళీనగర్ చేరుకున్న సందర్భంగా సంస్థ అధ్యక్షుడు కంటిపూడి వెంకటేశ్వరరావు తదితరులు స్వాగతం పలికి అభినందించారు. మరిన్ని ధార్మిక కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు.



అయోధ్య రామ మందిరంలో సంపూర్ణ రామాయణ పారాయణం చేసిన ఆర్ష విజ్ఞాన పరిషత్ సభ్యులు

న్యాయవాదుల సంక్షేమానికి ప్రాధాన్యం

విశాఖ లీగల్: న్యాయవాదుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తామని విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ అన్నారు. శుక్రవారం సాయంత్రం విశాఖ న్యాయవాదుల నూతన సంఘ పరిచయ కార్యక్రమం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులు, న్యాయమూర్తులు న్యాయవ్యవస్థకు రెండు కళ్లుగా అభివర్ణించారు. ఈ సందర్భంగా కొత్త అధ్యక్షుడు బెవర సత్యనారాయణ మాట్లాడుతూ సమస్యలను తక్షణం పరిష్కరిస్తూ అందరికీ అవసరమైన సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రధాన కార్యదర్శి డి.నరేష్, సీనియర్ సభ్యుడు అప్పారావు, న్యాయమూర్తులు, న్యాయవాదులు భారీ సంఖ్యలో, సీనియర్ న్యాయవాది కేశ ప్రగడ వెంకట నరసింహమూర్తి, బార్ అసోసియేషన్ నాయకులు శ్రీనివాసరావు, చింతపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మోసపూరిత పార్టీ కాంగ్రెస్

మండిపడ్డ ఆ పార్టీ సీనియర్ నాయకులు

తాటిచెట్లపాలెం: కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిన సందర్భాల్లో కూడా పార్టీ వెన్నంటి ఉన్న వారిని కాదని, కనీసం సభ్యత్వం, గుర్తింపు లేనివారికి పార్టీ నుంచి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా నిలబెట్టి, మోసం చేసిందని ఆ పార్టీ సీనియర్ నాయకులు వాపోయారు. రైల్వే న్యూకాలనీలోని సింకా గ్రాండ్ హోటల్‌లో శుక్రవారం విశాఖపట్నం పార్లమెంట్ నియోజకవర్గాలకు చెందిన ముఖ్య నాయకులు, ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు మనోజ్ చౌహాన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ విధి విధానాలు, ముఖ్యాంశాలను తెలియజేసేందుకు తాను వచ్చానన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి సీట్లు ఆశించి భంగపడ్డ వివిధ నియోజకవర్గాల నాయకులు ఆయనను నిలదీశారు. సమావేశం మొత్తం రసాభాసగా మారింది. ఎంపీ అభ్యర్థి ఎవరో తమకే తెలియదని, కొందరు జనసేనతో పార్టీ నాయకులు కుమ్మక్కయ్యారని, సీట్లు అమ్ముకున్నారని, కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు లేదని, ఇది అసలు కాంగ్రెస్ పార్టీ కాదు, షర్మిల పార్టీ అని ఆశావహులు భగ్గుమన్నారు. కొందరైతే ఏకంగా రెబెల్‌గా నిలబడైనా మా సత్తా చూపిస్తామని హెచ్చరించారు. దక్షిణ నియోజకవర్గం నుంచి సీటు ఆశించిన హైదర్ అలీ సింకా మాట్లాడుతూ రాహుల్ గాంధీ మైనార్టీల పార్టీ అని తెలపారని, వారికి సీట్లు ఇవ్వలేదని, దక్షిణలో ఉన్న 20 వేల మంది ముస్లింలను కాదని, వేరే వాళ్లకు ఇవ్వడం దారుణమన్నారు. తామంతా కలిసి కాంగ్రెస్‌కు ఎవరూ ఓటేయవద్దని ప్రచారం చేస్తామని హెచ్చరించారు.



రసాభాసగా మారిన కాంగ్రెస్ పార్టీ నాయకుల సమావేశం

నేడు వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహిస్తారు.

ఇంటర్ విద్యార్థుల ప్రతిభ

బుల్లయ్య జూనియర్ కళాశాల విద్యార్థులకు అభినందన



పులకందం సౌందర్య



కందికుప్ప మధులత



పి.విజయలక్ష్మి



కె.ప్రసన్న

సీతంపేట: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య జూనియర్ కళాశాల విద్యార్థులు శుక్రవారం విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో అద్భుత ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ కె.సోమేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో పులకందం సౌందర్య 462 మార్కులతో కళాశాల టాపర్‌గా నిలిచింది. కూరెళ్ల లక్ష్మి 458, పి.యోగేష్ భరత్ కుమార్ 454 మార్కులు సాధించారు. బైపీసీలో సీరపు కావ్యశ్రీ 416, మధుమిత దాస్ 415, సేనాపతి హేమంతేశ్వరి 411 మార్కులు, సీఈసీలో మారెళ్ల తన్మయి ఆశాదివ్య 455, ఎంఈసీలో ఇమంది యమున 441 మార్కులతో మెరిశారు.

➡ ఇంటర్ సెకండియర్ ఎంపీసీ ఫలితాల్లో కందికుప్ప మధులత 966 మార్కులు, కుప్పిలి వర్ష ప్రియదర్శిని 956, పసుమర్తి అఖిల 950, బైపీసీలో సీల సునీత 960, కరగాన దివ్య 944, పెదపెంకి అక్షయ 930 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా వీరిని బుల్లయ్య కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ అభినందించారు.

మెరిసిన ఎస్ఎంసీ హైస్కూల్ ప్లస్ విద్యార్థినులు

సీతమ్మధార: స్థానిక పీ అండ్ టీ కాలనీలోని ఎస్ఎంసీ హైస్కూల్ ప్లస్(జీవీఎంసీ) విద్యార్థినులు ఇంటర్మీడియట్‌లో పరీక్ష ఫలితాల్లో మెరిశారు. సెకండియర్ ఫలితాల్లో పి.విజయలక్ష్మి 768 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. కె.ప్రసన్న 738 మార్కులు సాధించింది. ఇంటర్ సెకండియర్‌లో 11 మంది ఎంపీసీ, ఏడుగురు బైపీసీ విద్యార్థినులు పరీక్షలు రాయగా.. వారిలో ఐదుగురు పాసయ్యారు. బైపీసీలో ఎవరూ ఉత్తీర్ణత సాధించలేదు. ఈ సందర్భంగా ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులను హెచ్ఎం రాంప్రసాద్, అధ్యాపకురాలు ప్రియదర్శిని అభినందించారు.

'ఫిట్జీ' విద్యార్థుల సత్తా

సీతంపేట: ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ఫిట్జీ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ చూపారు. ఫస్టియర్ ఫలితాల్లో ఆశీర్వాద్ మహాపాత్ర 465/470 మార్కులతో ప్రథమ స్థానంలో నిలవగా.. మల్లా స్నేహిత, అయ్యల సోమయాజుల అకిల్ 463/470 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు. 607 మంది పరీక్షలకు హాజరు కాగా.. 482 మంది 'ఏ' గ్రేడ్‌లో, 12 మంది 98 శాతం, 123 మంది 95 శాతం మార్కులు సాధించారు. సెకండియర్ ఫలితాల్లో శ్రీచరణ్ చిట్టినేని, శ్రేష్ఠ జైన్ 984/1000తో ప్రథమ స్థానంలో నిలవగా.. మనోజ్ఞ 983 మార్కులతో ద్వితీయ స్థానం, హేమాదిత్య 982 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. 729 మంది హాజరు కాగా.. 582 మంది 'ఏ' గ్రేడ్, 116 మంది 95 శాతానికి పైగా మార్కులు సాధించడం విశేషం. వీరిని ఫిట్జీ సెంటర్ మేనేజింగ్ పార్టనర్ పెండేల మస్తాన్‌రావు అభినందించారు.

ప్రజాశాంతి పార్టీ గుర్తు కుండ

తాటిచెట్లపాలెం: ప్రజాశాంతి పార్టీకి ఎన్నికల సంఘం కుండ గుర్తును కేటాయించింది. ఈ మేరకు శుక్రవారం పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ రైల్వే న్యూకాలనీలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ తన అభ్యర్థనను మన్నించి తమ పార్టీకి కుండ గుర్తును కేటాయించినందుకు ఎన్నికల సంఘం అధికారులు, హైకోర్టు న్యాయమూర్తులకు ధన్యవాదాలు తెలిపారు. కుండలు తయారుచేసే కుమ్మరి మాదిరిగానే తాను కూడా ప్రజల జీవితాలను తీర్చిదిద్దుతానన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు రెడ్డి యేసుపాదం, శుభాకర్, జిలుకర రవికుమార్, బాబోజీరావు, పార్టీ మహిళలు పాల్గొన్నారు.



కుండను చూపిస్తున్న ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్

ఫ్లిప్‌కార్ట్ గ్రోసరీ ఫుల్‌ఫిల్‌మెంట్ కేంద్రం ప్రారంభం

బీచ్‌రోడ్డు: ఉత్తరాంధ్రతోపాటు కాకినాడ, రాజమహేంద్రవరం ప్రాంతాలకు ఒక్క రోజులో కిరాణా సరకులను డెలివరీ చేసేందుకుగాను ఫ్లిప్‌కార్ట్ గ్రోసరీ ఫుల్‌ఫిల్‌మెంట్ కేంద్రాన్ని యలమంచిలి మండలం యర్రవరంలో ప్రారంభించినట్టు సంస్థ చీఫ్ కార్పొరేట్ అఫైర్స్ ఆఫీసర్ రజనీష్ తెలిపారు. కేంద్రం ప్రారంభోత్సవ వివరాలను మీడియాకు ఆయన తెలిపారు. ఈ కేంద్రం ద్వారా రోజుకు 8వేల ఆర్డర్లను డెలివరీ చేయగలగుతామన్నారు. సుమారు వెయ్యి మందికి ఉపాధి కల్పించనున్నట్టు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో తమ మార్కెట్ చాలా వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఇప్పటికే విజయవాడలో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, ఇది రెండో కేంద్రమని పేర్కొన్నారు. కార్యక్రమంలో హరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు వెల్లడించారు. విశాఖపట్నం-కొల్లాం(08539) వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ విశాఖపట్నంలో ప్రతీ బుధవారం ఉదయం 8.20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.55 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. ఈ నెల 17 నుంచి జూలై 3 వరకు నడుస్తుంది. కొల్లాం-విశాఖపట్నం (08540) వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ కొల్లాంలో ప్రతీ గురువారం రాత్రి 7.35 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 11.20 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ రైలు ఈ నెల 18 నుంచి జూలై 4వ తేదీ వరకు నడుస్తుంది.

➡ భువనేశ్వర్-యల్హంక(02811) స్పెషల్ భువనేశ్వర్‌లో ప్రతీ శనివారం రాత్రి 7.15 గంటలకు బయలుదేరి మరుసటిరోజు తెల్లవారు 1.53 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 1.55 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 11.55 గంటలకు యల్హంక వెళ్తుంది. ఈ రైలు ఈ నెల 13వ తేదీ నుంచి మే 25వ తేదీ వరకు నడుస్తుంది. యల్హంక-భువనేశ్వర్(02812) స్పెషల్ యల్హంకలో ప్రతీ సోమవారం ఉదయం 5 గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారు 4.30 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 4.32 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 12.15 గంటలకు భువనేశ్వర్ వెళ్తుంది. ఈ స్పెషల్ రైలు ఈ నెల 15 నుంచి మే 27వ తేదీ వరకు నడుస్తుంది.

➡ హౌరా-యశ్వంత్‌పూర్(02863) వీక్లీ ఏసీ స్పెషల్ ప్రతీ గురువారం హౌరాలో మధ్యాహ్నం 12.40 గంటలకు బయలుదేరి మరుసటిరోజు తెల్లవారు 2.43 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 2.45గంటలకు బయలుదేరి అదేరోజు మధ్య రాత్రి 12.15 గంటలకు యశ్వంత్‌పూర్ వెళ్తుంది. ఈ స్పెషల్ ఈ నెల 18 నుంచి జూన్ 27వ తేదీ వరకు నడుస్తుంది. యశ్వంత్‌పూర్-హౌరా (02864) వీక్లీ ఏసీ స్పెషల్ ప్రతీ శనివారం యశ్వంత్‌పూర్‌లో తెల్లవారు 5 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 11.05 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 11.07 గంటలకు బయలుదేరి మరసటి రోజు మధ్యాహ్నం 1.25 గంటలకు హౌరా వెళ్తుంది. ఈ స్పెషల్ ఈ నెల 20 నుంచి జూన్ 29వ తేదీ వరకు నడుస్తుంది.

➡ కొచ్చువేలి-షాలిమర్(06081) స్పెషల్ ప్రతీ శుక్రవారం సాయంత్రం 4.20 గంటలకు కొచ్చువేలిలో బయలుదేరి మరుసటి రోజు రాత్రి 10.50 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 10.52 గంటలకు బయలుదేరి ప్రతీ ఆదివారం మధ్యాహ్నం 1.40 గంటలకు షాలిమర్ వెళ్తుంది. ఈ రైలు ఈ నెల 12 నుంచి మే 31 వరకు నడుస్తుంది. షాలిమర్-కొచ్చువేలి(06082) స్పెషల్ షాలిమర్‌లో ప్రతీ సోమవారం మధ్యాహ్నం 2.20గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారు 4.18 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 4.20గంటలకు బయలుదేరి ప్రతీ బుధవారం ఉదయం 9.55 గంటలకు కొచ్చువేలి వెళ్తుంది. ఈ రైళ్లు ఈ నెల 15 నుంచి జూన్ 3 వరకు నడుస్తుంది.

➡ న్యూటిన్‌సుకియా-బెంగళూరు(05952) స్పెషల్ ప్రతీ గురువారం రాత్రి 6.45గంటలకు న్యూటిన్‌సుకియాలో బయలుదేరి మూడో రోజు మధ్యాహ్నం 1.50 గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఇక్కడి నుంచి 2.10గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9గంటలకు బెంగళూరు వెళ్తుంది. ఈ రైలు మే 2వ తేదీ నుంచి జూన్ 27వ తేదీ వరకు నడుస్తుంది. బెంగళూరు-న్యూటిన్‌సుకియా(05951) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ బెంగళూరులో ప్రతీ సోమవారం మధ్యరాత్రి 12.30 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 9.40 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఇక్కడి నుంచి 10 గంటలకు బయలుదేరి ప్రతీ బుధవారం మధ్యాహ్నం 1.15గంటలకు న్యూటిన్‌సుకియా చేరుకుంటుంది. ఈ రైలు మే 6 నుంచి జూలై 1 వరకు నడుస్తుంది.